# వయసెంత?

**–కె. ఇందిర**

ఒక ఆదివారం సాయంత్రం ప్రొఫెసర్ జి. జి. శాస్త్రి అనబడే ఘంటసాల గణితశాస్త్రి ఈజీ చైర్‌లో కూర్చుని నవల చదువుతున్నాడు. శాస్త్రి ధర్మపత్ని సంగీతంలో ఎమ్. ఎ. వంటింట్లో వసంత రాగాన్ని ఆలపిస్తూ పత్రికలో వచ్చిన వంటకాల మీద ప్రయోగం చేస్తోంది.

కూతురు సుగాత్రి డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చొని లతామంగేష్కర్ పాడిన పాటను ఖూనీచేస్తూ, పోనీటెయిల్ కట్టుకుంటోంది. కొడుకు గామా రెండు రెండ్లు నాలుగయినప్పుడు, నాలుగు నాలుగులు ఎనిమిది ఎందుకవకూడదు? – అనుకుంటూ లెక్కలతో కుస్తీ పడుతున్నాడు.



"ఈ లెక్క చెప్పండి నాన్నగారూ. ఒక స్త్రీ ఒక పనిని రెండు గంటల్లో చేస్తే, అదే పనిని నలుగురు స్త్రీలు ఎంత సేపట్లో చేస్తారు?"

"అంత మాత్రం తెలియదురా పిచ్చి గామా. నాల్గు గంటల్లో చేస్తారు!"

"లెక్కల ప్రొఫెసర్ గారూ! పప్పులో కాలేశారు. నలుగురు కలిస్తే అరగంటలో చేస్తారు." గులాబ్‌జామ్‌లు, చేగోడీల ప్లేట్లు టేబుల్ మీద పెడుతూ నవ్వుతూ అంది సంగీత.

"కరెక్ట్ బేబీ! నీ ఆన్సర్ పురుషులకి వర్తిస్తుంది. కాని ఈ లెక్కలో వుంది–స్త్రీలు. ఒక స్త్రీ వుంటే నోరు వూరుకుంటుంది చేతులు పనిచేస్తాయి. కాని నలుగురు స్త్రీలు కలిస్తే చేతులు వూరుకుంటాయి. నోళ్ళు పని చేస్తుంటాయి. అప్పుడు తొందరగా పని ఎలా తెములుతుందే డియర్ ప్రెట్టీ...."

"ఆ నవల్స్ చదివి నన్ను బేబీ, గీబీ, ప్రెటీ గిట్టీ అని పిలవకండి. అసలే వాడు లెక్కల్లో మొద్దు. ఇలా తప్పు ఆన్సర్లు చెప్పి వాడి బుర్ర పాడు చెయ్యకండి. అయినా నే నెప్పుడో చెప్పాను, ఏరాముడో, కృష్ణుడో అని వాడికి పేరు పెట్టకుందా మండీ అని. ఆల్ఫా, బీటూ, తీటూ, గామా అంటూ ఆ పేరు పెట్టారు వాడికి. పేరు గొప్ప–వూరు దిబ్బలాగా అయింది పరిస్థితి."

"ఏం చెయ్యను బేబీ, ఈ ప్రాబ్లమ్ ఇలా కాంప్లికేట్ అవుతుందని అనుకోలేదు. మా నాన్న లెక్కల మాష్టారు. నన్ను లెక్కల ప్రొఫెసర్‌గా చేసారు. నేను గామాగాణ్ని కంప్యూటర్‌కి పోటీగా నిల బెడదామనుకున్నాను. కాని వాడు ఎప్పుడూ రెండు రెండ్లు నాలుగు, నాలుగు, నాలుగులు ఎనిమిది అంటాడు. అదిసరే కాని బేబీ, నీ విషయంలో ఏమయింది? నా కూతురు లతామంగేష్కర్ అంత తియ్యగా పాడాలని దానికి సుగాత్రి అని పేరు పెట్టావు. కాని అది గార్ధభేశ్వరి అయింది. దీనికేమంటావు?"

"మీ పోలికే వచ్చింది దానికి. మీ ఇంటి పేరు ఘంటసాల వారు. మీరు ఎంతో చక్కగా పాడుతారు కాబోలు–ఎంచక్కా సినిమాల్లోలాగా బృందావన్ గార్డెన్‌లో, పార్కుల్లో కాకపోయినా, వంట ఇంట్లోనైనా డ్యూయెట్లు పాడుకోవచ్చును కదా అని మిమ్మల్ని పెళ్ళి చేసుకున్నాను. కాని రామ, రామ–మీ గొంతే వచ్చింది దానికి. ఏం చేస్తాను – అంతా నా కర్మ" అంటూ ముక్కు ఎగబీల్చి, కళ్ళు తుడుచుకుంది.

"అమ్మడూ సంగీతా, ఏం చేస్తున్నావే తల్లీ?" అంటూ వచ్చింది పక్కయింటి పిన్నిగారు.

"బేబీ, గులాబ్‌జామ్ ఘుమ ఘుమలు సోకి వచ్చింది మీ పిన్నిగారు. ఆవిడకి నైవేద్యం పెట్టేసి తొందరగా పంపించేసేయి. మనిద్దరం ఎంచక్కా లవ్ గేమ్ ఆడుకుందాము. ఆదివారం మళ్ళీ వారానికిగాని రాదుగా?"

"చాల్లెండి, సిగ్గు లేకపోతే సరి. లవ్ గేమ్‌ట, లవ్ గేమ్. నలభై ఏళ్ళు దాటాయి ఇంకా బుద్ధి రాలేదు." మూతి మూడు వంకలు తిప్పుతూ వెళ్ళింది సంగీత.

"పిన్నిగారూ! గులాబ్‌జామ్‌లు చేశాను. తిని ఎలాగున్నాయో చెప్పండి."

ఆ గదిలోంచి వస్తున్న శబ్దతరంగాలు గణిత శాస్త్రి కర్ణభేరిని చొచ్చుకుని పోయాయి.

నవలను ప్రక్కన పెట్టేసి, వాళ్ళ సంభాషణ వినసాగాడు. ఆడవాళ్ళ ముచ్చట్లు వింటుంటే భారతం కూడా వినబుద్ధవదు, ఇక ఈ నవల ఒక లెఖ్ఖా! గులాబ్‌జామ్‌లు తింటూ వినసాగాడు.

"చాలా బాగున్నాయి సంగీతా, ఎలా చేశావ్? మా కోడలు పిల్లకు కాస్త చెప్పు తల్లీ. అన్నట్లు ఈ మాట నిజమేనా, నీతోపాటు ఆడపిల్లల కాలేజీలో ఏదో అలజీ లెక్చరర్‌గా చేస్తోందే విమల, దానికి పెళ్ళట కదూ, అయినా ముప్పై ఏళ్ళు దాటాక ఇంకా పెళ్ళేమిటీ? మా కాలంలో మేము ముప్పై ఏళ్ళకే అమ్మమ్మలయ్యాము."

"మీ కాలం ఎందుకండీ, నాకు మటుకు నాకు పదహారేళ్ళకే పెళ్ళయింది. విమల నా ఈడుదే, నాకప్పుడే పద్నాలుగేళ్ళ కూతురుంది."

"అమ్మాయి సంగీతా! ఇంకొక్క మాట. ఎవరితో చెప్పబాకేం! పెళ్ళికొడుకు దానికంటే ఆరునెలలు చిన్నవాట్ట. హయ్యో రామ వరహీనం ఎంత తప్పు? మీ బాబాయిగారిక్కి, నాకు పద్దెనిమిదేళ్ళు తేడా వుంది తెలుసా?"

గణితశాస్త్రి చెవులు నిక్కబొడుచుకున్నాయి.

"నిజమా పిన్నిగారూ, ఎంత విడ్డూరం! మీ అల్లుడుగారిక్కీ నాకూ పదేళ్ళు తేడావుంది. అయినా మనకెందుకులెండి వాళ్ళ గొడవ. అన్నట్లు పిన్నిగారూ మీ స్వరాజ్యానికి ఏమైనా సంబంధాలు చూస్తున్నారా?"

"దానికిప్పుడేం తొందరే సంగీతా, ఇంకా రెండు పదులు దాటందే! సరేగాని నేవెళ్ళొస్తాను, వీలుంటే మా కోడలికి గులాబ్‌జాములు చెయ్యడం చెప్పు. వస్తానమ్మా." పిన్నిగారి భారీకాయం గుమ్మం దాటగానే, బుగ్గలు నొక్కుకుంటూ గణితశాస్త్రి దగ్గిరకు వచ్చింది సంగీత.

"ఈ విడ్డూరం విన్నారాండీ, మన ఇండియాకి స్వరాజ్యం వచ్చిన రోజునే పుట్టిందట—అందుకని స్వరాజ్యలక్ష్మి అని పేరు పెట్టారట. మనకి స్వరాజ్యమొచ్చి ముప్పైఏళ్ళయింది. కాని ఆ స్వరాజ్యానికింకా ఇరవైఏళ్ళు నిండలేదట. ఇంకానయం—పదేళ్ళ చిన్నబొప్పి అని చెప్పలేదు" మూతి మూడు వంకలుగా తిప్పింది సంగీత.

"ఆలెక్క తరువాత క్యాలుక్‌లేట్ చేద్దాం గాని బేబీ, నీకూ నాకూ నిజంగా పదేళ్ళు తేడావుందీ? అలాగయితే పదిహేడేళ్ళకే ఎమ్. ఎ చదివి లెక్చరర్‌గా ఎలా పనిచేస్తున్నావబ్బా. ఈలెక్క సరిగ్గా రాదే! అయినా పెళ్ళప్పుడు నీకూ నాకూ మూడేళ్ళు తేడా అని గుర్తు. ఇప్పుడు పదేళ్ళు ఎలా అయిందబ్బా?" బట్టతల నిమురుకుంటూ గొణిగాడు జి. జి. శాస్త్రి.

"మీ లెక్కలు సరే, నా బ్రతుకూసరే. ఆడవాళ్ళ వయస్సుకు మైనస్‌లేగాని ప్లస్‌లు చేర్చకూడదండీ మీకు తెలీదేమో! మీరు ఆ లెక్కల వివరాలు చూసుకోండి. నేవెళ్ళి విమల పెళ్ళి వివరాలు కనుక్కుంటాను."

సంగీత వెళ్ళినవైపే చూస్తూ "బొరా! ఆడవాళ్ళ మాటలకి అర్థాలే వేరులే అని ఎవరన్నారో గాని, సెంట్‌పర్సెంట్ కరెక్ట్. మైనస్‌లే కాని ప్లస్‌లే లేవుట. ఆడదే ఒక ప్లస్. బ్రహ్మచారి జీవితం ఒక మైనస్. వాడికున్న బరువు బాధ్యతలు జీరో. పెళ్ళనే ప్రాబ్లమ్‌లో మైనస్‌కి ప్లస్‌ను చేరుస్తారు. అప్పుడా ఈక్వేషన్ ఎంత పెద్దదయింది!

బ్రహ్మచారి + భామామణి = సంసారం + సంతోషం = సంతానం + ఖర్చులు + ఆడంబరాలు + అప్పులు + చదువులు సంధ్యలు + పెళ్ళిళ్ళు + కట్నాలు = అల్లుళ్ళు + కోడళ్ళు + మనుమళ్ళు + మనుమరాళ్ళు + మునిమనుమళ్ళు + మునిమనుమరాళ్ళు.

ఓ మైగాడ్, ఇలా ఇన్ని ప్లస్‌లు చేరిగదా, జనాభా ఇలా పెరిగిపోతోంది. ప్రపంచ జనాభాకి ఇన్ని ప్లస్‌లు చేరుస్తున్న వనిత, వయసులో మాత్రం మైనస్ అంటుందేం?

సత్యహరిశ్చంద్రా, నువ్వు ఆడదానిగా పుట్టివుంటే నీకా పేరు వచ్చి వుండేదే కాదయ్యా. వయసు విషయంలో పచ్చి అబద్ధం ఆడేసేవాడివి. ఓ పురుషపుంగవా! నువ్వు చంద్రమండలానికి వెళ్ళావు. అంగారక గ్రహంలో ప్రాణికై వెతుకుతున్నావు. కాని ఆడదాని వయస్సును చెప్పే యంత్రం కనిపెట్టలేక పోతున్నావు. ఇది గణిత శాస్త్రానికే అవమానం." గణితశాస్త్రి డ్రామాలోలాగా ఒక పోజ్ ఇచ్చాడు.

"ఒరేయ్ గణితశాస్త్రీ, నువ్వు ఆ యంత్రం కనిపెట్టి పేరు సార్థకం చేసుకో" మనసు చెప్పిన మాటలను పాటించడానికి నిశ్చయించు కున్నాడు ప్రొఫెసర్ జి. జి. శాస్త్రి.

*

"బేబీ, సక్సెస్, గ్రాండ్‌సక్సెస్, ప్యాకెట్ క్యాలుక్‌లేటర్‌ని కనిపెట్టేశాను." సినిమాల్లోలాగా భార్యను పైకిఎత్తి, సర్కస్‌లో లాగే ఒక ఫీట్ చేద్దామనుకున్నాడు కాని, ఆ భారాన్ని, తన భారం మోయడానికి ప్రయత్నిస్తే ప్రమాదమని వూరుకున్నాడు. ఆ సంతోషాన్ని వ్యక్తం చెయ్యడానికి సంగీతను కేంద్రంగా పెట్టి, తను చుట్టూరా తిరుగుతూ వృత్తం గీసేశాడు గణితశాస్త్రి.

"ఇదేమిటండీ, గిన్నె గిరగిర, చెమ్మచెక్క ఆడతానంటారు? చేతులు వదలండి. ఇంతకీ అది దేన్ని క్యాలుకలేట్ చేస్తుంది. బ్లాక్‌మనీనా?" కందిపోయిన చేతులను చూసుకుంటూ అంది సంగీత.

"వయస్సుని. వున్నదున్నట్లే క్యాలుకలేట్ చేస్తుంది. త్వరలోనే మార్కెట్‌లో పెట్టబోతున్నాను." గర్వంగా అన్నాడు గణితశాస్త్రి.

"ఏడిసినట్లే వుంది. వయస్సును కనుక్కుంటే ఏం గొప్పండీ. ఇంకేదైనా అయివుంటే సంతోషించేదాన్ని." విసురుగా వెళుతున్న సంగీతను చూస్తూ నీరుకారి కుర్చీలో కూలబడ్డాడు గణితశాస్త్రి.

మార్కెట్‌లో ఆ ప్యాకెట్ క్యాలుక్‌లేటర్స్ హాట్‌కేక్స్‌లాగా అమ్ముడు పోతున్నాయి. ఖరీదు తక్కువ. విలువ ఎక్కువ. ఆఫీసుల్లోనూ, హాస్పటల్స్‌లోనూ, మార్కెట్‌లోను, మహిళా మండలులలోనూ, కాలేజీల్లో, స్కూళ్ళల్లో ఎక్కడ చూసినా క్యాలుక్‌లేటర్లే. ముఖ్యంగా పెళ్ళికొడుకులకు, ప్రెస్ రిపోర్టర్‌లకు క్యాలుక్‌లేటర్ బాగా పనికి వచ్చింది. ఎలక్షన్ టైములో వోటర్ల లెక్కకు క్యాలుక్లేటర్ గాబా సహాయం చేసింది.

ఒక ఇంట్లో పెళ్ళివారు వచ్చి పెళ్ళికూతురును చూశారు. జరగవలసిన తంతు అంతా అయింది. ఫలహారాలు బాగా పట్టించారు మగ పెళ్ళివారు.

"బావగారూ పిల్ల నచ్చిందండీ. మీరు ఇచ్చిన జాతకం ప్రకారం మీ అమ్మాయికి పందొమ్మిదేళ్ళని వుంది. మరి ఈ క్యాలుక్లేటర్ ఏమి చెపుతుందో చూద్దామా? ఏమ్మా, రమా, రామ్మా. ఈబటన్ నొక్కమ్మా. చాలమ్మా."

వయస్సు ఇరవైనాలుగని చెప్పింది. క్యాలుక్లేటర్.

"చూడండీ బావగారూ మావాడి వయసు ఇరవైనాలుగు, మీ అమ్మాయి వయసు ఇరవైనాలుగు. అంటే వరహీనం అవుతుంది. మేము వేరే సంబంధం చూసుకుంటాము. మీకు శ్రమ ఇచ్చాము. క్షమించండి."

క్యాలుక్లేటర్‌ను, ఖాళీ ప్లేట్లను చూసి పళ్ళు



విజయనగరంలోని జేసీరెట్స్‌వారు ఈమధ్య–ప్రభుత్వ మహారాణి ఆసుపత్రిలోని శిశువులకు పాల సీసాలు, రోగులకు పళ్ళు బహూకరించారు. జేసీరెట్స్ అధ్యక్షురాలు శ్రీమతి పి. సన్యాసమ్మరాజు, తమ సంస్థ కార్యక్రమాలను గురించి వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆసుపత్రి ముఖ్య వైద్యురాలు శ్రీమతి అహల్య–జేసీరెట్స్ చేస్తున్న సేవలను అభినందించారు.

పటపటలాడించాడు తండ్రి. నూరు అబద్ధాలాడైనా ఒక ఇల్లు నిలబెట్టమన్నారు కదా అని వయస్సు అబద్ధం చెప్పి దొంగ జాతకాలు సృష్టించి ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసే తండ్రులను దెబ్బతీసింది క్యాలుక్లేటర్.

*

చిత్రపత్రిక రిపోర్టర్. సినీతార సితారా ఇంటర్‌వ్యూ జరపడానికి ఆమె భవనానికి వచ్చాడు. స్విమ్మింగ్‌పూల్ నుంచి జలకన్యలాగా వస్తున్న ఆమెను తన కెమెరాలోకి లాక్కున్నాడు రిపోర్టర్. లోపలికివెళ్ళి చీర కట్టుకొని మేకప్ చేసుకుని వచ్చింది సితారా. ఈలోపున రిపోర్టర్ ఆమె పెంచే కుక్కల్ని, పిల్లుల్ని, పిట్టల్ని, పువ్వుల్ని కలిపి ఫోటో తీసేశాడు. భవనంలోకి వెళ్ళి ఖరీదైన ఫర్నిచర్‌ని, పనిమనిషి ఎల్లమ్మ అనబడే ఆమె అక్కయ్యనూ ఫోటో తీశాడు.

"మిస్ తారా! మీరు సినీరంగంలో ప్రవేశించి ఎన్ని సంవత్సరాలయింది?"

"పది సంవత్సరాలండీ." పొడుగాటి గోళ్ళకు వేసిన పాలిష్‌ను చూసుకుంటూ అంది ఆమె.

"మరి జీవితరంగంలోకి ప్రవేశించి ఎన్నేళ్ళయిందంటారు?"

"పద్దెనిమిది ఏళ్ళు అయిందండీ" ముంగురులను అలవోకగా సర్దుకుంటూ చిరునవ్వుతో అంది.

"మీలో ఇంత గ్లామర్ పెరగడానికి మీరేం చేస్తారు? మీ హాబీస్ ఏమిటి? మీ హైట్, వెయిట్ చెపుతారా శ్రమ తీసుకోకుండా."

"దానికేముందండీ. ప్రొద్దుటే కాఫీలాంటి పానీయాలు త్రాగను. నిమ్మరసం త్రాగుతాను. తీపి పదార్థాలు, ఐస్‌క్రీంలులాంటి లావుని పెంచే పదార్థాలు తినను. సబ్బు వాడను, సున్ని పిండి వాడుతాను. నా హాబీసంటారా? తోటపని చెయ్యడం, తీరిక సమయాల్లో వంట చెయ్యడం, తోటి కళాకారులతో సరదాగా కాలం గడపటం—ఇవే నా హాబీలు. నా హైట్ అయిదడుగుల నాలు గంగుళాలు, బరువు నూట పది పౌన్లు. ఇక నా వయసు...." ఆమె మాటలను అర్థాంతరంగా ఆపాడు రిపోర్టర్.

"మీ కా శ్రమ అక్కరలేదు తారగారూ. ఈ బటన్ నొక్కండి చాలు. ఆఁ చాలు... చిత్ర పత్రికలో విరిసే పుష్పంగా ప్రచురించబోతున్నాము మీ గురించి. నవ్వులు పువ్వులు చిందుతూ ఒక పోజ్ యివ్వండి. ఆఁ ఓ. కె. చాలా థ్యాంక్స్. నమస్తే వస్తానండీ."

నెల రోజుల తరువాత తన ముఖచిత్రంతో వెలువడిన చిత్రపత్రిక చూస్తూ చిరునవ్వు చిందిస్తోంది సితార. ఆమె చెప్పిన విషయాలన్నీ వున్నాయి దానిలో. వయసు మాత్రం పాతిక సంవత్సరాలని వుంది. అయిదారు సంవత్సరాలుగా 'టీన్ ఏజ్ గ్లామర్ తార'గా వెలుగొందుతున్న సితారా అనబడే మల్లమ్మకు తన నిజమైన వయస్సును చూడగానే గ్లామర్ ఒక్కసారిగా తగ్గిపోయింది. గ్లామర్ కోసం వయసు తక్కువ' చెప్పుకునే తారలకు క్యాలుక్‌లేటర్ కంటక ప్రాయమయింది.

*

ఎలక్షన్లు వస్తున్నాయి. ఒక పల్లెటూరులోని పంతులుగారు ఇంటింటికి వెళ్ళి వోటర్లజాబితా తయారు చేస్తున్నారు. ఒక ఇంటి ముందు ఆడపిల్లలంతా చేరి అష్టాచెమ్మా ఆడుకుంటున్నారు. పంతులుగార్ని చూసిన సుబ్బులు లేచి తల్లిని పిలిచింది.

"అమ్మోయ్. పంతులుగారొచ్చారు, పంతులు గారండీ వోట్లకేనా మీరొచ్చింది. మా ఇంట్లో అమ్మా, నాన్న, నేను — ముగ్గురం వున్నాము వోటు వేసేటందుకు."

"రండి పంతులుగారు రండి. ఒసేవ్ సుబ్బులూ నువ్వు పంతులుగారికి కాస్త కాఫి పెట్టు." కూతుర్ని వంటింట్లోకి పంపి వెనకాలే వెళ్ళింది సుందరమ్మ.

"ఒసేవ్ సుబ్బులూ, నీకు సిగ్గులేదటే. ఓటు వేస్తావా—ఓటు. ఓటు వెయ్యడానికి వెళ్ళితే అందరూ నిన్ను చూస్తే ఏమనుకుంటారు? ఇరవై ఒక్క ఏళ్ళు దాటాయనుకుంటారు. నేనేమో పద్దెనిమిది అని అందర్కీ చెప్తుండా. సాల్లే నింగాడం." మొట్టింది సుందరమ్మ.

"అమ్మా, నిజంగా నాకు ఇరవై ఒకటి నిండాయికదే. ఎంచక్కా మల్లయ్యగారు పంపిన కారులో అక్కడికి పోయి, వాళ్ళిచ్చిన కాపీలు తాగి ఓటు వేసి, వేలికి బొట్టు పెట్టించుకొని మళ్ళీ కాపీలు తాగి మ్యాటినీ సినిమాకి పోయి ఇంటికి రావొచ్చును. అమ్మా నేను ఓటు వెయ్యవద్దా?"

"నోరు మూసుకుని వెళ్ళి కాఫీ ఇచ్చిరా పంతులుగారికి. నీకంటే పెద్దది ఎల్లయ్యగారమ్మాయి–ఓటు వెయ్యడానికి రాదుట తెలుసా. నువ్వు ఒక్కదానివే ఓటు వెయ్యకపోతే కొంప లేమీ అంటుకోవు. మళ్ళీ ఆ వూసెత్తకు." కూతురు వెనకాలే వెళ్ళింది సుందరమ్మ.

"పంతులుగారూ అమ్మాయికి ఇంకా పందొమ్మిదేనండీ. ఓటు వెయ్యాలని వుందిట."

"అక్కయ్యగారూ. అమ్మాయి వయసు మీరు చెప్పక్కర్లేదు. ఈ క్యాలుక్‌లేటర్ చెపుతుంది. సుబ్బులూ ఈ బటన్ నొక్కమ్మా చాలు. ఆ. చూడండీ సుందరమ్మగారూ, మీ సుబ్బులు వయసు ఇరవై రెండని చెపుతోంది. అందుకని ఓటు వెయ్యోచ్చండీ. చూడండీ అక్కయ్యగారూ మన కాలం అయిపోతోంది. భవిష్యత్తు వాళ్ళది. వాళ్ళ నాయకుల్ని వాళ్ళే ఎన్నుకోవాలండీ. వయసు ఎక్కడ బయటపడిపోతుందో అని అమూల్యమైన ఓటు హక్కును జారవిడుచుకుంటే ఎలాగండీ. అందరి తల్లులూ ఇలా చేస్తే మన ప్రజాస్వామ్యం ఎలా నిలుస్తుందండీ. సుబ్బులూ! నువ్వు ధైర్యంగా వెళ్ళి ఓటు వెయ్యి తల్లీ. వెళ్ళొస్తానండీ అక్కయ్యగారూ."

"ఓరి నీ తల్లి కడుపు బంగారం కాను. అక్కయ్యట. అక్కయ్య. నాకంటె పెద్దవాడివి. ఏమిటబ్బా! ఆ పెట్టె క్షణంలో సుబ్బులు వయస్సు చెప్పింది. ఇంకానయం నేను నొక్కానుకాదు ఆ బటన్. నా సామిరంగా ఆ పెట్టే ఎల్లయ్యగారి కూతురు వయసు చెప్పాలా, దాని బండారం బయటపడాలా! పాతికేళ్ళు వచ్చాయి. సుబ్బులు కంటే చిన్నదిట–చిన్నది" వంటింట్లోకి వెళ్ళి మిగిలిన కాఫీని త్రాగేసింది సుందరమ్మ ఎల్లయ్యగారి కూతురు వయసు బయటపడబోతోందనే సంతోషంలో.

*

క్యాలుక్‌లేటర్ చేసే వింతల్ని ప్రజలు కథలుగా చెప్పుకుంటున్నారు. అది–సర్వీసు కోసం వయసు తక్కువ చెప్పుకునేవారి గుట్టు బయటపెట్టింది. అమ్మమ్మల వయసు దగ్గర్నుంచీ పదేళ్ళు తక్కువ చెప్పి తమ వయసు పదేళ్ళు తగ్గించి చెప్పుకునే మహిళల గుట్టు రట్టుచేసింది. పైకి కాకపోయినా లోపల తిట్టుకుంటున్నారు క్యాలుకలేటర్ కనిపెట్టిన గణితశాస్త్రిని.

సంగీత రోజు కొకసారైనా అంటుంది. "మా విమెన్స్ కాలేజిలో అంతా క్యాలుక్లేటర్‌ను గురించి అనుకునేవారే. పనిపాటా లేనివాడెవడో కనిపెట్టాడని–కన్పిస్తే మంచి సన్మానం చెయ్యాలని తిట్టుకుంటున్నారు. మీరేనని తెలిస్తే నన్ను ముందు చంపేస్తారు."

"చూడు ప్రెట్టీ. ఆర్కిమెడేస్ అంతటి శాస్త్రజ్ఞుడ్ని పిచ్చివాడన్నారు. అన్నవాళ్ళే బ్రహ్మరథం పట్టారు. అలాగే నన్ను తిట్టిన నోళ్ళే పొగడకపోవు. నువ్వు చూడకపోవు బేబీ." మీసం మెలిబెట్టుకుంటూ ధుర్యోధనుడి లాగా పోజ్ ఇచ్చాడు.

ఒక రోజు గణితశాస్త్రికి సన్మానమంటూ ఆహ్వానమొచ్చింది. నోబుల్ ప్రైయిజు వచ్చినంత సంతోషపడ్డాడు జి. జి. శాస్త్రి. గర్వంగా సభలోకి అడుగుపెట్టాడు.

ఒక మగువ మిరపకాయలదండ మెళ్ళో వేసింది. ఘాటును తట్టుకోలేక తుమ్మసాగాడు గణితశాస్త్రి.

మాంచి దిట్టమైన అబలలు, అప్పడాల కర్రలతో, చిప్ప గరిటెలతో, అట్ల కాడలతో చుట్టుముట్టారు. పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడి లాగా పద్మాక్షుల వ్యూహంలో చిక్కుకున్నాడు గణితశాస్త్రి. కౌరవ సైన్యాన్ని చూసిన ఉత్తరకుమారుడి లాగా వణికిపోతున్నాడు. మనసులోనే ఆంజనేయస్తోత్రం పఠిస్తూ బిత్తరచూపులు చూడసాగాడు గణితశాస్త్రి.

"ఏం నాయానా, నీ నిర్వాకమేనా ఇది! పనీపాటాలేకపోతేసరి. ఎవరి వయసు ఎంత వుంటే నీకెందుకంట. నువ్వేమైనా యమధర్మ రాజువా, చిత్రగుప్తుడవా? ఇంకెప్పుడైనా మా వయసుల జోలికి వచ్చి ఇలాంటి పిచ్చి వేషాలు వేస్తే నీ బుర్ర రాంకీర్తన పాడిస్తాము. ఇప్పుడైనా మించిపోలేదు పత్రికాముఖంగా ప్రకటించెయ్యి–నీ క్యాలుకలేటర్ చెప్పే వయసు తప్పని దానికి పదేండ్లు మైనస్ చెయ్యాలని! చెప్పకపోయావో జాగ్రత్త." కళ్ళు వురిమింది ఒక కమలాక్షి.

"తల్లుల్లారా..." అనగానే అర్ధాంతరంగా ఆపింది ఒక ప్రౌఢ.

"ఏమన్నావు బుచ్చిబాబూ, నీ కళ్ళకి మేమందరం తల్లుల్లాగా కనిపిస్తున్నామా. మాటలు సరిగ్గా రానియి."

"అమ్మమ్మా, అంతమాట........" అనగానే మళ్ళీ ఆపింది ఒక సబల.

"తల్లులన్నావు. ఇప్పుడు అమ్మమ్మలంటున్నావా మనమడా, బ్రతుకు మీద నీకు ఆశలేదా?"

"సారీ సిస్టర్స్. నేనంత మాట అనలేదు. నే చెప్పేదేమిటంటే నా క్యాలుక్లేటర్ చెప్పేది తప్పు కాదని...."

"కాదు! తప్పేనని ఒప్పుకో. ఇదే ఆఖరి ఛాన్సు." ఒక అట్లకాడ పైకి లేచింది.

"అయ్య బాబోయ్. తప్పని ఒప్పుకుంటాను. ఇప్పుడే ప్రెస్‌కి వెళ్ళి రిపోర్ట్ చేస్తాను. నన్ను ముందు ఈ వ్యూహంలోంచి బయటపడనీయండి" చెమటతో తడిసిపోతున్నాడు గణితశాస్త్రి.

"సరే వదిలి వేస్తున్నాం. రేప్రొద్దుటే పేపర్లో ప్రకటన లేకపోతే సాయంత్రంకల్లా నీ పని ఖాళీ. జ్ఞాపకం వుంచుకో." అప్పడాల కర్రలు, అట్లకాడలు, చిప్పగరిటెలు దారిని వదిలాయి.

తల మీద చేతులు తియ్యకుండానే జై వీరాంజనేయా అనుకుంటూ బయటకు దుమికాడు ప్రొఫెసర్ జి. జి. శాస్త్రి.

మంచం మీద నుంచి ధన్‌మని క్రిందపడ్డ గణితశాస్త్రిని లేపింది సంగీత.

"అర్ధరాత్రిపూట అంకమ్మశివాలులాగా ఏమిటీ క్రిందపడటాలు, కలవరింతలూ! మరీ మీకు మతి పోతోందీ. లెక్కల పిచ్చి ఎక్కువయింది. లేచి మంచం మీద పడుకోండి." ఆవలిస్తూ భర్తను బలవంతంగా కూర్చోపెట్టింది సంగీత. బట్టతలను గట్టిగా పట్టుకున్న చేతులను ఊడతీసింది.

"అమ్మయ్య, ఇది కలేనా? ఇదే నిజమైతే ఇంకా ఎంత భయంకరంగా వుండేదో. భగవంతుడా నేను చస్తే ఈ జన్మలో ఆ క్యాలుక్‌లేటర్ మాట ఎత్తుకోను. అయినా నేనేమైనా యమధర్మరాజునా, చిత్రగుప్తుడినా ఆ వూసు ఎత్తుకునేందుకు! ఆ గొడవేదో వాళ్ళే చూసుకుంటారు. బ్రతికాను భగవానుడా, ఇంకా నయం ఈ కల రాకముందే క్యాలుక్‌లేటర్‌ని కనిపెట్టేసి వుంటే నిజంగా నా బ్రతుకు జీరో అయివుండేది. బుద్ధి వచ్చింది." లెంపలు గట్టిగా వేసుకున్నాడు గణితశాస్త్రి.

క్యాలుక్‌లేటర్ ఏమిటో, యమ ధర్మరాజు, చిత్రగుప్తుడేమిటో లెంపలేసుకోడమేమిటో అర్థం కాక భర్తను విచిత్రంగా చూసింది సంగీత. ఆటువిమ్మట–విబూది తెచ్చి గణితశాస్త్రి నుదుటన అరచేతి మందాన రుద్దింది—మళ్ళీ పీడకలలు రాకుండా. □